పత్తాలేని పాసు పుస్తకాలు



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు పోతకంటి నగేశ్‌రెడ్డి. తండ్రి మరణించడంతో వారసత్వం కింద రెండు ఎకరాల భూమిని తాంసి మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్టోబర్ 20న స్లాట్ బుక్ చేసుకొని పట్టా చేసుకున్నాడు. కానీ ఇప్పటి వరకు పట్టా పాసుపుస్తకం రాలేదు. పాసు పుస్తకం లేక పోవడంతో పంటలు విక్రయించుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. జిల్లాలో 6058 మంది రైతుల పరిస్థితి ఈ విధంగానే ఉంది.



తహసీల్దార్ కార్యాలయంలో భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు (ఫైల్)

- 6,058 మంది పట్టాదారుల ఎదురుచూపు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఎలాంటి స్పష్టతనివ్వని అధికారులు

ఇచ్చోడ: భూములు క్రయ విక్రయాలు చేసిన పట్టాదారులకు పాసు పుస్తకాలు అందక ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పట్టా చేసిన నిమిషాల వ్యవధిలోనే పట్టాపాసు పుస్తకాలను అందచేస్తామని గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. వాటి బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించింది. గతంలో వారం లోపే పట్టా పాసుపుస్తకాలు వచ్చేవి. కానీ గత మూడు నెలల నుంచి పట్టాలు చేసుకున్న పట్టాదారులకు పాసు పుస్తకాలు రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మూడు నెలలుగా..

జిల్లాలో భూములు కొనుగోళ్లు చేసుకున్న 6058 మంది పట్టదారులు గత మూడు నెలల నుంచి పట్టా పాసుపుస్తకాలు అందక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పాసు పుస్తకాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్న పట్టాదారులు ప్రతీ రోజు పోస్ట్ సిబ్బందిని కలిసి పాసు పుస్తకాల కోసం ఆరా తీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గత మూడు నెలల నుంచి పాసుపుస్తకాలు అందక పోవడంపై అధికారుల వద్ద స్పష్టత లేదు. పాసు పుస్తకాల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. అధికారులు సరైన సమాధానం చెప్పక మాటను దాట వేస్తున్నారు. పాసు పుస్తకాలు నేరుగా పోస్ట్ ద్వారా ఇంటికి వస్తాయని చెబుతున్నా.. మూడు నెలల నుంచి రాక పోవడానికి కారణం ఏంటని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

గత మూడు నెలల నుంచి పాసు పుస్తకాలు అందలేక పోవడంపై పూర్తి సమాచారం లేదు. హైదరాబాద్‌లో ఉన్న ఏజెన్సీ ద్వారా పాసు పుస్తకాలు నేరుగా రైతుల వద్దకు వెళ్తాయి. కానీ మూడు నెలల నుంచి రాక పోవడంపై ప్రభుత్వానికి నివేదిస్తాం.

– వినోద్‌కుమార్, ఆదిలాబాద్ ఆర్డీవో

సంక్షేమ పథకాలకు అడ్డంకి..

భూములు కొనుగోలు చేసిన వారికి పాసు పుస్తకాలు రాక పోవడంతో సంక్షేమ పథకాలకు అడ్డంకిగా మారింది. పంట రుణాలు, ఇతర దీర్ఘకాలిక రుణాలు, రైతు బీమా, రైతుభరోసా, మార్టిగేజ్ రుణాలు, పంటలు విక్రయించుకునేందుకు పాసు పుస్తకాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రీడల అధికారి

ఉట్నూర్‌రూరల్: మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం కేబీ ప్రాంగణంలోని మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈనెల 16 నుంచి జరిగే జిల్లాస్థాయి పోటీల్లో రాణించేలా మంచి జట్లను ఎంపిక చేయాలని కోరారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఎంఈవో ఆశన్న, మండల కన్వీనర్ హేమంత్, రమేశ కృష్ణ, జల్పతి, ఉపేందర్, సురేశ్, సంగీత, రవీందర్, శివకృష్ణ, సునంద్ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

నార్నూర్: గ్రామస్థాయి నుంచే ప్రతిఒక్కరూ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల క్రీడా మైదానంలో సీఎం కప్ క్రీడ పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ యువతీ, యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడంతో పాటు గ్రామీణ క్రీడాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్, పీఈటీ విశ్వనాథ్, కోరెళ్ళ మహేందర్, రాథోడ్ సికిందర్ పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి గంగాధర్

ప్రోత్సాహక బహుమతులు అందజేత

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి, అక్కడే విధులు నిర్వహించి, ఇటీవల పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు పొన్నారి నాగబూషణ్ ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు శ్రీ పొన్నారి ఈశ్వరానంద ప్రతిభ పురస్కారాలు గురువారం అందజేశారు. 2023– 24వ సంవత్సరంలో పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5100, రెండో ర్యాంకు సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ. 2100లు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఎంఈవో కుమ్మరి పోశెట్టి, ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నాగబూషణ్

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుగుణ

ఉట్నూర్‌రూరల్: పూలాజీ బాబా సిద్దేశ్వర్ సంస్థాన్ పట్నాపూర్, ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి మండలంలోని అంజి గ్రామంలో ఈనెల 14, 15 తేదీల్లో 35వ ఆధ్యాత్మిక సత్సంగ్ వార్షికోత్సవం, ధ్యాన మందిరం ప్రారంభోత్సవ నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో నిర్వాహణ కమిటీ సభ్యులు ముకాడే విష్ణు, శేషరావ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక సేవలో ప్రతిఒక్కరూ పాల్గొని, సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సుదర్శన్, దుందేరావు, గోవింద్ పాల్గొన్నా రు.

అవగాహన సదస్సులో ఎమ్మెల్యే బొజ్జు



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన శాసన పరిషత్, శాసన సభ కార్యనిర్వహణ విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దుద్దుల శ్రీధర్ బాబు, ఉత్తం కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని పాహార్ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కన్క రేణుక రక్తహీనతతో బాధపడుతుండగా ఆమెను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు అత్యవసరంగా ఏబీ నెగిటీవ్ రక్తం అవసరం ఉందని వైద్యులు సూచించారు. దీంతో సాంగిడి గ్రామానికి చెందిన యువకుడు గణేశ్ రక్తదానం చేశారు.

వైద్య శిబిరం

బేల: మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండో వైద్యాధికారి అఖిల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కోల నర్సింలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్, పాత్రికేయుల ఫ్రెండ్లీ క్రికెట్

బోథ్: మండలంలోని లాల్‌పిచ్‌లో గురువారం పోలీసులు, పాత్రికేయుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన పాత్రికేయుల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. క్రికెట్ మ్యాచ్‌లో పోలీసు జటు విజయం సాధించింది. ఎస్సై ప్రవీన్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

కొమురవెల్లి మల్లన్న పల్లకి ఊరేగింపు



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

తాంసి: మండల కేంద్రంలో గురువారం కొమురవెల్లి మల్లన్న పల్లకిని ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పులతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో పల్లకిని ఉంచి భక్తులు పూజలు చేశారు. మహిళలు మంగళ హారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పొచ్చారెడ్డి, స్వామి, రామన్న యాదవ్. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సు ఏర్పాటుకు వినతి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో 108 అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అత్యవసర వేళ ఇతర ప్రాంతం నుంచి అంబులెన్స్ వచ్చేందుకు ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, ప్రణీత్, అర్షద్, లాజర్, సాయికృష్ణ, అజయ్, నరేశ్, సంజయ్, వంశీ, దయాకర్ తదితరులున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి స్థానికులకే ఇవ్వాలి



వేం నరేందర్ రెడ్డితో మాట్లాడుతున్న నవీన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి స్థానిక నాయకులకే ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలిమెల నవీన్ రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా పార్టీ కోసం కష్టపడి పనిచేశానని, తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు.

మహాధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న లింగాల చిన్నన్న

ఎదులాపురం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16, 17 తేదీల్లో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10 వేల కనీస వేతనం అందించాలన్నారు. అలాగే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందించాలని, ఎండీఎం నిర్వహణను ప్రైవేటు సంస్థకు అందించకూడదన్నారు. జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సంగీత, లక్ష్మి, లక్ష్మిబాయి, కమలాబాయి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి



వినతిపత్రం అందజేస్తున్న జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో నెలకొన్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర ఉద్యోగుల రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం జరిగిందని, వారిని వెంటనే రెగ్యులరైజ్ చేసేలా చూడాలన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ పనులు జరిగేలా ప్రస్తావన చేయాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నాయకులు లోలం శ్యామ్‌సుందర్, చారులత, బుక్య జాన్సన్, రాంకిషన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 15న నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. విద్యావేత్తలు, సంఘ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి జ్ఞానోబా, నాయకులు అడెల్లు, పాండురంగ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మావల విద్యుత్ శాఖ ఏఈ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మావల మండల కేంద్రంలోని కొత్తవాడలో కేవీఏ 63 ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా కాలనీలో సింగిల్ లైన్ ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారని, లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట సిబ్బంది సతీష్ రెడ్డి, మల్లేశ్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. గురువారం జైనథ్ మండల కేంద్రంలో విద్యుత్ ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. లూజ్‌లైన్, బిల్లులు, వ్యవసాయ విద్యుత్ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, ఏడీ కొమ్ముర్ శ్రావణ్, ఏఈ రాజేందర్ ప్రసాద్, ఏవో శ్రీనివాస్, జేవో సత్యనారాయణ పాల్గొన్నారు.

23 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

నేరడిగొండ: హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 23 నుంచి 25 వరకు రాజులతండా గ్రామంలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. మథుర కుల గురువులతో పాటు వేద పండితుడు ఎల్కూచి శ్రావణ్‌కుమార్, రమేశ్ పంతుళ్లు, ఇతర వేద పండితుల బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సొనాల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా దినేశ్



నియామక పత్రం అందజేస్తున్న మల్లేశ్

బోథ్: సొనాల మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ అధ్యక్షుడిగా గడచంద దినేశ్, అధికార ప్రతినిధిగా కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా లంక విజయ్, ఉపాధ్యక్షుడిగా హరీశ్, కార్యదర్శిగా రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా వికాస్‌తో పాటు 8 మంది సభ్యులు, నలుగురు సలహాదారులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంతో పాటు, సంస్థాగత నిర్మాణానికి కృషి చేయాలని నాయకులు ఆరెల్లి మల్లేశ్, సతీష్ కోరారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్విని యోగం చేసుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం ఓ ప్రకటనలో సూచించారు. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని కేసులు సత్వరం పరిష్కరించనున్నట్లు తెలిపారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. క్రిమినల్, సివిల్, ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల తగాదాలు, బ్యాంక్, ఇన్సూరెన్స్, చెక్‌బౌన్స్, వాహన ప్రమాదాలు, వైవాహిక వివాదాలు, చిట్‌ఫండ్స్ కేసులన్నీ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలనుకున్న కక్షిదారులు రాజమార్గంలో పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

‘ప్రభుత్వంపై విమర్శలు సరికాదు’

కడెం: కనీసం రేషన్‌కార్డులు ఇవ్వలేని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. గురువారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, వేలాదిగా ఉద్యోగాలను భర్తీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు దుర్గం రాజేశ్, మోరపాక రాజు, శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పర్యటన విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 14న బోథ్ నియోజకవర్గంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటనను కాంగ్రెస్ శ్రేణులు విజయంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి కోరారు. గురువారం ఆయన ఇచ్చోడలో మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు ఇచ్చోడ మార్కెట్ కార్యాలయంలో నూతనంగా నియమించిన మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకరంలో పాల్గొంటారన్నారు. అనంతరం నేరడిగొండ మండలంలోని లఖంపూర్‌లో ఆశ్రమ పాఠశాలను సందర్శించనున్నారు. బోథ్ మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని చించోలి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. చిన్నపిల్లలలో రక్తశాతం తక్కువ ఉండడంతో అనారోగ్యానికి గురి కాకుండా వైద్య పరీక్షలు చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘చలో ఉట్నూర్ ’ విజయవంతం చేయండి



గిరిజనులతో సమావేశమైన నాయకులు

తాంసి: ఈనెల 16న చేపట్టిన చలో ఉట్నూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని కొలాం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం దిలీప్ కోరారు. గురువారం మండలంలోని ఆయా జల్‌కోరి, కరన్ వాడీ గ్రామాల్లో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి ప్రతిఒక్కరూ తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కొలాం సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం జైదేవ్, నాయకులు మడావి అనిల్, రామారావు, విశాల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి గోపీనాథ్ ముండేకు నివాళి

ఇంద్రవెల్లి: దివంగత కేంద్ర మంత్రి గోపీనాథ్ ముండే జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో మండల వంజరి సమాజ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం చైర్మన్ మారుతి డొంగ్రె పటేల్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా ఆయన చేసిన ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వంజారి సమాజ్ పెద్దలు గిత్తే మారుతి, ఫడ్ వరుణ్, ముస్లే కేశవ్, ముండే సాయినాథ్, ఫడ్ వికాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ స్థలం చదును

సిరికొండ: మండల కేంద్రంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించిన సిరికొండ శివారులోని స్థలాన్ని గురువారం ఎస్సై శివరాం జేసీబీతో చదును చేయించారు. స్థలం ఎవరూ కబ్జా చేయకుండా హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

టీపీసీసీ జనరల్ సెక్రటరీని కలిసిన పోతారెడ్డి

నేరడిగొండ: టీపీసీసీ జనరల్ సెక్రటరీ, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్‌ను యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి కోసం కృషి చేయాలని తెలిపినట్లు పోతారెడ్డి వివరించారు.

వ్యాసరచన పోటీలు

నేరడిగొండ: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ జాదవ్ చంపత్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలతో పాటు స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.